

**జరిగిన కథ :** గిరివ్రజమనే పట్టణపు యువరాణి ప్రఫుల్ల. ఆమె తాను పెంచుకుంటున్న అడవి చిలకకు మాటలు రావడం కోసం మువ్వలను కట్టింది. అంతే, అకస్మాత్తుగా ఆ చిలక పురుషుడిగా మారిపోయింది. తన పేరు కళాభిరాముడని ఆ పురుషుడు చెప్పాడు. తనకు మువ్వలమ్మిన కోయ వనిత కోసం యువరాణి ప్రయత్నించింది. కానీ, మరునాడు ఆ కోయవనిత భర్త మాత్రమే కనిపించాడు.




# రాకాసి చిలక

అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**

“తెలియకపోవడం ఏమిటి? మాకు చిలక మంత్రాలకంటే గుర్రం మంత్రాలే బాగా తెలుసు'' అన్నాడు కోయదొర నవ్వుతూ.

“అయితే ఓసారి లోపలికి రా'' అంటూ తీసుకుపోయాడు సుబ్బిశెట్టి.

అతని పెరట్లో కట్టేసిన గుర్రం.. కోయదొరను చూడగానే ఉత్సాహంగా సకిలించింది. అతను దానిని గుర్తించాడు. అయినా తెలియనట్లుగా నటిస్తూ..

“శెట్టిగారూ! ఇంత మంచి గుర్రం ఎక్కడ దొరికింది మీకు?'' అని ప్రశ్నించాడు.

సుబ్బిశెట్టి తెలివితక్కువ వాడు కాదు.

“దీనిని మా అల్లుడు పారశీక దేశం నుంచి తెప్పించాడు. దీనిని హెచ్చువెలకు అమ్మాలంటే ఈ గుర్రాన్ని చిలకగా మార్చి మన దేశం దాటించాలి. గుర్రాలను చిలకలుగా, చిలకలను గుర్రాలుగా మార్చే మంత్రాలు నీకు తెలిసుంటే చెప్పు.. చక్కని వ్యాపారం సాగుతుంది. నీ వాటా నీకిచ్చేస్తాను'' అన్నాడు రహస్యంగా సుబ్బిశెట్టి.

“ఇదిగో.. ఈ ఓషధిని చీకటి పడిన తరువాత గుర్రం మెడ వద్ద తగిలించండి. ఏం జరుగుతుందో చూడండి'' అని చెప్పి, కోయదొర తన బహుమానాన్ని తీసుకుని అక్కణ్నుంచి వెళ్లిపోయాడు.

ఆ వీధిలో సుబ్బిశెట్టితోపాటుగా మరో ముగ్గురు వర్తక ప్రముఖులు ఉన్నారు. వారందరి దగ్గరా గుర్రాలు ఉన్నాయి. ఒక్కొక్కరే విడివిడిగా కోయదొరను తమ ఇళ్లకు తీసుకుపోయి, గుర్రాలను చూపించి.. వాటిని చిలకలుగా మార్చమని కోరారు. వారందరికీ ఓషధీ లతలు దొరికాయి. ఆ తరువాత కోయదొర వేరొక వీధికి వెళ్లిపోయాడు. అక్కడ ఇద్దరు పురుషులు కోయదొరకు ఎదురుగా వచ్చారు.

“అన్నయ్యా!'' అని పిలుస్తూ అతణ్ని హత్తుకున్నారు.

కోయ వేషాలలో కాకుండా రాజపుత్రుల్లా కనిపిస్తున్న వారిద్దరినీ చూసి కోయదొర అమితమైన ఆనందాన్ని కనబరిచాడు. కొద్దిసేపు వాళ్లు ముగ్గురూ తమలో తాము ఏవేవో సంగతులు కలబోసుకున్నారు. చివరిగా..

“తమ్ముళ్లూ! మన గుర్రాలు నాలుగూ ఈ ఊరిలోని వర్తకులకు దొరికాయి. వాళ్లకు నేను కొన్ని ఓషధులు ఇచ్చాను. ఆ ఓషధులు తాకగానే మన గుర్రాలు మళ్లీ చిలకలై ఎగిరిపోతాయి. కొద్దిసేపటిలో మన వద్దకు వచ్చేస్తాయి'' అని చెప్పాడు కోయదొర.

“అన్నయ్యా! ఇంతకీ ఈ మువ్వలేమిటి? ఓషధులేమిటి?! ఇవన్నీ నువ్వెక్కడ సంపాదించావు? అసలింతకీ మేమంతా చిలకలై పోవడానికి కారణం ఏమిటి?!'' అని ప్రశ్నించారు రాజపుత్రులు.

“అంతా చెబుతాను కదా.. పదండి'' అంటూ దారి తీశాడు కోయదొర.

* * *

అప్పటికి సమయం సాయంత్రం కావస్తున్నది.

యువరాణి ప్రఫుల్ల తన మందిరంలో స్నేహితురాళ్ల ఆగమనం కోసం ఎదురు చూస్తున్నది. తొందరలోనే వారు రానే వచ్చారు.

“కాళిందీ! రుక్మవతీ! మీరిద్దరూ మీకు నేనిచ్చిన మువ్వలను మీ చిలకలకు కట్టారా? ఆ తరువాత ఏదైనా అద్భుతాన్ని చూశారా?'' అని ప్రశ్నించింది ప్రఫుల్ల.

“చూశాం యువరాణీ! ఆ చిలకలు చూస్తుండగానే సుందరమూర్తులైన పురుషులుగా మారిపోయారు. ఇదేదో ఇంద్రజాలంలా ఉంది'' అని ముక్తకంఠంతో జవాబిచ్చారు వాళ్లిద్దరూ.

“వాళ్లను మీరు పలకరించారా? ఇంతకూ ఎవరు వాళ్లు?'' మళ్లీ అడిగింది యువరాణి.

“చెప్పారు యువరాణీ! నా మందిరంలో ఉన్న పురుషుడి పేరు సుధర్ముడట. కన్యాకుబ్జపు యువరాజునని చెప్పుకొన్నాడు'' అన్నది కాళింది.

“ఆశ్చర్యంగా ఉందే.. నా మందిరంలో ఉన్నవాడూ ఆ రాజ్యపు యువరాజే! అతని పేరు సులోచనుడట'' అని చెప్పింది రుక్మవతి.

వారి మాటలు ఆలకిస్తూనే లోపలినుంచి కళాభిరాముడు బయటికి వచ్చాడు. అతణ్ని చూస్తూనే కాళింది, రుక్మవతి ఆశ్చర్యపోయారు.

“నా మందిరంలో ఉన్న పురుషుడు అచ్చంగా ఇతని పోలికలోనే ఉన్నాడు'' అన్నారు వారిద్దరూ ఒకేసారి.

“చెలులారా! మీ మందిరంలో రహస్యంగా ఉన్న వారిద్దరినీ వెంటనే ఇక్కడికి తీసుకురండి'' అని చెప్పి పంపింది యువరాణి.

కొద్దిసేపటికే తిరిగి వచ్చి..

“వాళ్లిద్దరూ మందిరాల్లో లేరు. ఏమైపోయారో!?'' అని సమాచారం తెచ్చారు కాళింది, రుక్మవతి.